

దాహార్తి తీర్చిన ఎస్ఎస్ ట్యాంకు

- అప్పటి సిపిఎం ఎమ్మెల్యే గఫూర్ చొరవతో నిర్మాణం
- ప్రస్తుతం పెరిగిన జనాభాకనుగుణంగా నీరు కరువు

ఎం.ఎ.గఫూర్ సిపిఎం తరపున ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆయన చొరవతో కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ కోసం సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మించారు. అప్పట్లో అది నగర ప్రజల దాహార్తిని తీర్చింది. ప్రస్తుతం నగర జనాభా పెరిగిపోవడం, పాలకులు పట్టించుకోకపోవడంతో మళ్లీ తాగునీటి సమస్య తలెత్తింది. సిపిఎం ఎమ్మెల్యేలు ఉంటేనే ప్రజల కష్టాలు పట్టించుకుంటారని ప్రజలు చర్చించుకుంటున్నారు...



ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

2005కు ముందు కర్నూలు నగరం అప్పటి జనాభాకనుగుణంగా తుంగభద్ర నది ఒడ్డున పంపింగ్ స్టేషన్ నుంచి నీటిని పంపు హౌస్‌కు సరఫరా చేసుకొని అక్కడ శుద్ధి చేసి నగర ప్రజలకు సరఫరా చేసే పరిస్థితి ఉండేది. వేసవి వచ్చిందంటే తాగునీటి కోసం తల్లడిల్లేవారు. అప్పట్లో చేతి పంపులు (బోరుబావుల) ద్వారా నీటిని ప్రజలు వాడుకునేవారు. నాడు నదుల్లో నీరు కలుషితం కూడా ఉండేది కాదు. 2002లో కల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో కలిసింది. వేసవి అవసరాల కోసం సమ్మర్ స్టోరేజీ ట్యాంకు మంజూరు దశాబ్దాలు దాటినా పని మాత్రం నత్తనడకన సాగుతున్న పరిస్థితి అప్పట్లో ఉండేది. ఎన్నికల్లో విజయం సాధిస్తే సంవత్సరంలోనే సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మాణం పూర్తి చేయించి నగరానికి తాగునీటి కొరత లేకుండా చేస్తామని సిపిఎం ప్రధాన వాగ్దానం చేసింది. 2005లో రూ.122 కోట్లతో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మాణం అనేక అవరోధాలు ఎదురైనా అనుకున్నది సాధించడం లో నాటి ఎమ్మెల్యే ఎం.ఎ.గఫూర్ సఫలీకృతులయ్యారు. నల్లమట్టి కొరత సమస్య, భూగర్భంలో రాతిపొరల్లో గ్రౌండ్ చేయడంలాంటి ఎన్నో సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. అయినా రాష్ట్రస్థాయి అధికారులందరినీ సంప్రదించి వారి సహకారంతో వారం వారం నిర్మాణ ప్రగతిని చేస్తూ వెంటపడడం వల్ల అనుకున్న పని పూర్తయింది. రూ.122 కోట్ల ఖర్చుతో ఎన్నికలు జరిగిన సంవత్సరంలోనే ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణం పూర్తి చేసి 2005 జూన్ 12న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి, కర్నూలు ఎమ్మెల్యే ఎం.ఎ.గఫూర్ చేతులమీదుగా సమ్మర్ స్టోరేజీ ట్యాంకును ప్రారంభించారు. ట్యాంకర్ల అవసరం లేకుండా ఐదేళ్లుగా నగరానికి నీటి కొరత లేకుండా చేసిన ఘనత ఎమ్మెల్యే ఎం.ఎ.గఫూర్‌కు దక్కింది. మొదట్లో నీరు పచ్చగా వస్తే అప్పుడు కూడా ఎమ్మెల్యే గఫూర్ రాష్ట్రస్థాయి అధికారులను రప్పించి సమస్య మూలాలను పరిశోధించి మళ్లీ అటువంటి సమస్య రాకుండా శాశ్వతంగా పరిష్కరించిన సంగతి ఎవరూ మర్చిపోరని చెప్పవచ్చు. వీటికి తోడుగా 12 ఓవర్ హెడ్ ట్యాంకులను కూడా నిర్మించారు.

నేడు మళ్లీ నీటి సమస్య

నాలుగేళ్ల క్రితం కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌లో మామిదాలపాడు, మునగాలపాడు, స్టాంటన్‌పురం, పాణ్యంలోని పెద్దపాడు, పందిపాడు, లక్ష్మీపురం గ్రామాలు కూడా కలిశాయి. నగర విస్తీర్ణం పెరిగింది. శివారు కాలనీలు పెరిగాయి. జనాభా పెరిగిపోవడంతో జనాభాకనుగుణంగా నీటి అవసరాలు తీర్చేందుకు కావాల్సినంత సమ్మర్ స్టోరేజీ ట్యాంకు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. తుంగభద్ర నది పక్కనే ఉన్న తాగునీరు అందించలేకపోయారు. మరో సమ్మర్ స్టోరేజీ ట్యాంకును నిర్మించాలని నగర వాసులు కోరుతున్నారు.

అప్పట్లో నీటి సమస్య తీరింది

- సిహెచ్.సీతాలక్ష్మి, ముజఫర్ నగర్



గఫూర్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎస్ఎస్ ట్యాంకు నిర్మించడంతో అప్పట్లో నీటి సమస్య తీరింది. ప్రస్తుతం నగర జనాభా పెరిగిపోతూ ఉండడంతో ప్రజల అవసరాలకు తగినంత నీరు అందడం లేదు. ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తే వాటి వద్ద నీటి కోసం యుద్ధాలు జరుగుతున్నాయి. ప్రజలు ఆస్తి, చెత్త పన్నులు చెల్లిస్తున్నా అధికారులు మాత్రం రోజూ తాగునీరు అందించలేని పరిస్థితిలో ఉన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు శ్రద్ధ చూపి రోజూ తాగనీరు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి. అందుకే ప్రజల కష్టాలు తెలిసిన నాయకులను రాబోయే ఎన్నికల్లో ఎన్నుకోవాలి.

పట్టించుకోని పాలకులు

- టి.రాముడు, సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి



కర్నూలు ఎమ్మెల్యేగా గఫూర్ ఉన్నప్పుడు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మాణం వల్ల అప్పట్లో ప్రజల దాహార్తి తీరింది. నగరంలో ప్రస్తుతం జనాభా పెరిగింది. పాలకులు మారినా ప్రజల దాహార్తి తీరలేదు. ఇప్పటికీ కల్లూరు ప్రాంతంలో రోజు మార్చి రోజు నీళ్ల రావడం, వేసవిలో మూడు రోజులకు ఒకసారి నీరు వదలడంతో వేసవిలో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వేసవిలో తాగునీరు అందించడంలో చూపాల్సిన శ్రద్ధ చూపకుండా నగరంలో ప్రధాన వీధుల్లో రంగులు వేసి ప్రజాధనాన్ని వృథా చేస్తూ స్మార్ట్ సిటీ, గ్రీన్ సిటీలుగా ప్రచారం చేసుకుంటున్నారు. రెండో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మాణం చేసి అదనంగా ఓవర్ హెడ్ ట్యాంకులను కూడా నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎన్నికల హడావుడి ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కేంద్ర ఎన్నికల సంఘం అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా ఎన్నికల హడావుడి మొదలైంది. ఏపిలో మే 13న ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఏప్రిల్ 18న అధికారిక నోటిఫికేషన్ విడుదల కానుంది. ఆ రోజు నుంచి నామినేషన్లను స్వీకరించనున్నారు. నామినేషన్ల స్వీకరణకు ఏప్రిల్ 15 చివరి తేదీగా నిర్ణయించారు. ఏప్రిల్ 26న నామినేషన్ల పరిశీలన నిర్వహించనున్నారు. అభ్యర్థుల ఉపసంహరణకు గడువు ఏప్రిల్ 29గా ప్రకటించింది. ఎన్నికల షెడ్యూల్ రావడంతో శనివారం నుంచే ఎలక్షన్ కోడ్ అమలులోకి వచ్చింది. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు ఈ కోడ్ వర్తించనుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 33,86,885 మంది ఓటర్లున్నారు. అందులో పురుష ఓటర్లు 16,68,310, మహిళా ఓటర్లు 17,18,001 మంది ఉన్నారు. ఇక థర్డ్ జెండర్ ఓటర్లు 574 మంది ఉన్నారు. అయితే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చూసుకుంటే పురుష ఓటర్ల కంటే 49,691 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా మొత్తం ఓటర్లు 20,14,7954 మంది ఉన్నారు. అందులో పురుష ఓటర్లు 9,94,885 మంది ఉండగా మహిళా ఓటర్లు 10,19,597 మంది ఉన్నారు. ఇక థర్డ్ జెండర్ ఓటర్లు 312 మంది ఉన్నారు. అందులో 24,712 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. నంద్యాల జిల్లా వ్యాప్తంగా మొత్తం ఓటర్లు 13,72,091 మంది ఉన్నారు. అందులో పురుష ఓటర్లు 6,73,425 మంది ఉండగా, మహిళా ఓటర్లు 6,98,404 మంది ఉన్నారు. థర్డ్ జెండర్ ఓటర్లు 262 మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 24,979 మంది అధికంగా ఉన్నారు.

వైసిపి అభ్యర్థులు ఖరారు : వైసిపి అభ్యర్థులను ఆ పార్టీ అధిష్టానం ఖరారు చేసింది. ఆ పార్టీ అధినేత వైఎస్.జగన్ మోహన్ రెడ్డి శనివారం ఇడుపులపాయలో వైసిపి తరపున పోటీ చేసే ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. కర్నూలు ఎంపీ అభ్యర్థిగా బివై.రామయ్యను, నంద్యాల ఎంపీ అభ్యర్థిగా పోచా బ్రహ్మానందరెడ్డిని ప్రకటించారు. ఎమ్మెల్యే అభ్యర్థుల్లో అధికంగా సిట్టింగ్‌లకే ఛాన్స్ ఇచ్చారు. కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ ఆదిమూలపు సతీష్‌ను, ఆదోని అభ్యర్థిగా వై.సాయి ప్రసాద్ రెడ్డిని, కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎఎండి.ఇంతియాజ్‌ను, మంత్రాలయం ఎమ్మెల్యే అభ్యర్థిగా వై.బాలనాగిరెడ్డిని, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా బుట్టా రేణుకను, పత్తికొండ ఎమ్మెల్యే అభ్యర్థిగా కంగాటి శ్రీదేవిని, ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా బుసినే విరూపాక్షి, నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ దారా సుధీర్‌ను ప్రకటించారు. బనగానపల్లె ఎమ్మెల్యే అభ్యర్థిగా కాటసాని రామిరెడ్డిని, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థిగా గంగుల బ్రిజేంద్రారెడ్డిని, నంద్యాల ఎమ్మెల్యే అభ్యర్థిగా శిల్పా రవి చంద్రకిషోర్ రెడ్డిని, పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థిగా కాటసాని రాంభూపాల్ రెడ్డిని, డోన్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని, శ్రీశైలం ఎమ్మెల్యే అభ్యర్థిగా శిల్పా చక్రపాణిరెడ్డిని ప్రకటించారు.

టిడిపి ఎంపీ అభ్యర్థులు ఖరారు : టిడిపి ఎంపీ అభ్యర్థులను ఖరారు చేసింది. ఈ మేరకు ఆ పార్టీ అధిష్టానం తమ అభ్యర్థుల మూడో జాబితాను శుక్రవారం విడుదల చేసింది. కర్నూలు టిడిపి ఎంపీ అభ్యర్థిగా బస్తిపాటి నాగరాజు, నంద్యాల టిడిపి ఎంపీ అభ్యర్థిగా బైరెడ్డి శబరిని ప్రకటించారు. కర్నూలు ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు ప్రస్తుతం కర్నూలు మండలం పంచలింగాల ఎంపిటిసి సభ్యునిగా ఉన్నారు. ఆయన గతంలో కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్ గా పని చేశారు. సినీ రంగంలో పలు సినిమాలకు నిర్మాతగా కూడా వ్యవహరించారు. కర్నూలు ఎంపీ స్థానానికి టిడిపి నుండి పలువురు ఆశావహులు పోటీ పడ్డారు. నంద్యాల ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి కుమార్తె. ఆమె మొన్నటి వరకూ బిజెపి నంద్యాల జిల్లా అధ్యక్షురాలిగా ఉన్నారు. ఇటీవల బిజెపికి రాజీనామా చేసి చంద్రబాబు నాయుడు సమక్షంలో టిడిపిలో చేరారు. ఆమె ఎంబిబిఎస్ విద్యను అభ్యసించారు.



జిజిహెచ్‌కు గ్రీన్ క్లాత్ విరాళం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు గ్రీన్ క్లాత్‌ను విరాళంగా అందజేశారని ఆసుపత్రి ఇంచార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ సి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు లియో టెక్ లినెన్ అండ్ లాండ్రీ సర్వీసెస్ శ్రీనివాస రెడ్డి, జిజి హెచ్ కర్నూలుకు గ్వాలియర్ కంపెనీకి చెందిన మంచి నాణ్యత కలిగిన 1000 మీటర్ల గ్రీన్ క్లాత్‌ను విరాళంగా అందించారని తెలిపారు. లియో టెక్ లినెన్ అండ్ లాండ్రీ సర్వీసెస్ శ్రీనివాస రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రి సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఒ డాక్టర్ వెంకటరమణ, లాండ్రీ సర్వీసెస్ సిబ్బంది శ్రీనివాసరెడ్డి, నర్సింగ్ సూపరింటెండెంట్ జి 1 వెంకటతులసమ్మ, నర్సింగ్ సూపరింటెండెంట్ జి 2 నాగమణి సావిత్రిబాయి, తదితరులు పాల్గొన్నారు.


గ్రీన్ క్లాత్‌ను అందజేస్తున్న దాతలు

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

- భగత్ సింగ్ వర్ధంతిలో వక్తల పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో మతోన్మాదుల నుంచి రాజ్యాంగాన్ని కాపాడుకుందామని విద్యార్థి, యువజన, కార్మిక, సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. కర్నూలు నగరంలోని వీధి వీధినా వాడవాడనా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ 93వ వర్ధంతిని నిర్వహించారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ అధ్యక్షతన అవుట్‌డోర్ స్టేడియం, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర అధ్యక్షతన ధర్మపేట, హోటల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు అంజి అధ్యక్షతన ఆర్ఎస్ రోడ్డు కూడలిలో, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా అధ్యక్షతన చిరంజీవి పార్క్ దగ్గర భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించారు. డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్న, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గౌస్ దేశాయ్, ఎపి రైతు సంఘం రాష్ట్ర నాయకులు జగన్నాథం, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలు) రాష్ట్ర జిల్లా అధ్యక్షులు, కె.కుమార్, జిల్లా నాయకులు ఎస్. లక్ష్మన్న మాట్లాడారు. భగత్‌సింగ్ చిన్నప్పటినుండే గద్దర్ వీరులు, స్వాతంత్ర పోరాట యోధుల ఉద్యమాలకు ఆకర్షితులై చదువుకునే రోజుల నుండే స్వతంత్ర పోరాటంలో పాలుపంచుకున్నారన్నారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల నుండి భారతదేశాన్ని విముక్తి చేయడానికి విద్యార్థుల్ని, యువకుల్ని పెద్ద ఎత్తున ఉద్యమాల్లోకి తీసుకురావడంలో కీలక పాత్ర వహించారన్నారు. నేడు సరిగ్గా సామ్రాజ వాద శక్తులు భారతదేశంలో చొరబడి ప్రజల సొమ్మును లూటీ చేస్తున్నాయని అన్నారు. ప్రజలు మతం మత్తులో, దేవుడి పేరుతో పోరాటంలోకి రాకుండా బిజెపి ప్రభుత్వం కుట్రలు చేస్తుందని విమర్శించారు. భారతదేశం నుండి మతోన్మాదులను తరిమి కొట్టాలని లౌకిక ప్రజాస్వామ్య, వామపక్ష శక్తులను కాపాడుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా నాయకులు గోవర్ధన్, నగర నాయకులు ఇబ్రహీం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప, నగర కార్యదర్శి సాయి ఉదయ్, శివ ఆటో యూనియన్ సిఐటియు నాయకులు కుమార్, రామ్ మద్దయ్య, సోమన్న హోటల్ వర్కర్స్ యూనియన్ నాయకులు, ఎఐటియుసి నాయకులు, ఆర్ఎస్ రోడ్డు, చిన్న పార్కు బంగారు పేట, ట్యాక్సీ డ్రైవర్స్ యూనియన్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని భగత్ సింగ్ రాజ్ గురు సుఖదేవులకు నివాళి అర్పించారు.

భగత్ సింగ్ ఆశయాలను ముందుకు తీసుకోవాలి

భగత్ సింగ్ ఆశయాలను ముందుకు తీసుకుపోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ అన్నారు. బుధవార పేటలో భగత్ సింగ్ 93వ వర్ధంతి సభ భవనమ్మ గుడి దగ్గర నిర్వహించారు. భగత్ సింగ్, రాజ్ గురు,సుఖదేవ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. సివిల్ సప్లై హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్య క్షులు ఆర్.కృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో పిఎస్. రాధా కృష్ణ మాట్లాడారు. కర్నూలు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సర్కిల్లో రైతు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతిని నిర్వహించారు. సిఐటియు నాయకులు బజారి, ఎఐటియుసి నగర నాయకులు కిట్టు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.ఆనంద్ బాబు, సిఐటియు ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.విజయ్, ఎఐటియుసి నగర నాయకులు మహేష్ ఏపీ సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.కృష్ణ పాల్గొన్నారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం అని భారత రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం అని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు, సిఐటియు నగర ఉపాధ్యక్షుడు టి రాముడు కార్మికులకు పిలుపునిచ్చారు. భగత్ సింగ్ ,రాజ్ గురు, సుఖదేవ్ ల 93వ వర్ధంతి సందర్భంగా మార్కెట్ యార్డు నందు లారీ లోడింగ్ అన్ లోడింగ్ హమాలి వర్కర్స్ యూనియన్ నాయకత్వంలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. మార్కెట్ యార్డ్ నుండి ఇందిరాగాంధీ నగర్ పివి నరసింహారావు నగర్ సీతారాం నగర్ వరకు సీతారాం నగర్ నుండి సుందరయ్య జంక్షన్ వరకు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. సుందరయ్య సర్కిల్‌లో సభ నిర్వహించారు. మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు కె.అరుణ అధ్యక్షత వహించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి. అంజిబాబు సిఐటియు నగర ఉపాధ్యక్షుడు టి.రాముడు మాట్లాడారు. కర్నూలు బిర్లాగడ్డ ప్రాంతంలో సిఐటియు బిర్లా గడ్డ హమాలీ యూనియన్, ఆటో యూనియన్ల ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్ దేవ్ వర్ధంతిని నిర్వహించారు. హమాలి యూనియన్ నాయకుడు సి.సురేష్ అధ్యక్షత వహించారు. సి. క్యాంప్ సెంటర్ సిఐటియు ఆటో యూనియన్ ఆధ్వర్యంలోభగత్ సింగ్ జయంతి నిర్వహించారు. సిఐటియు నగర అధ్యక్షులు ఆర్. నరసింహులు, సిఐటియు ఆటో యూనియన్ నగరకార్యదర్శి బి.రాధాకృష్ణ మాట్లాడారు. కర్నూల్ నగరంలో 1, 2, 3, 11, 12 వార్డులలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతి సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి. గౌస్ దేశాయ్, సిఐటియు జిల్లా నాయకులు పి. గోవిందు, ఆవాజ్ నగర కార్యదర్శి షరీఫ్ మాట్లాడారు. **తుగ్గలిలో** సిపిఎం నాయకులు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భగత్ సింగ్ రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతి నిర్వహించారు. సిపిఎం మండల కార్యదర్శి శ్రీరాములు మాట్లాడారు.


ఓల్డ్ సిటీలో నివాళులర్పిస్తున్న గౌస్‌దేశాయ్, నాయకులు


అవుట్‌డోర్ స్టేడియం వద్ద నివాళులర్పిస్తున్న గౌస్‌దేశాయ్, నాయకులు


బుధవార పేటలో నివాళులర్పిస్తున్న రాధాకృష్ణ, నాయకులు


వ్యవసాయ మార్కెట్‌లో నివాళులర్పిస్తున్న అంజిబాబు, రాముడు, నాయకులు


చిరంజీవి పార్కు వద్ద సభలో మాట్లాడుతున్న డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రామన్న

పావనికి రాణిరుద్రమదేవి పురస్కారం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



సాయి సుబ్బయ్య రవీంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ పోలూరిపావనికి రాణి రుద్రమదేవి 2024 ఉత్తమ మహిళా పురస్కారాన్ని హైదరాబాదులో మక్స్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేశారు. పావని ఇంగ్లీష్ సాహిత్యంలో విశిష్ట ప్రావీణ్యం చూపిన నేపథ్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య , సాయి సుబ్బయ్య,రవీంద్ర విద్యా సంస్థల అధినేత సుబ్బయ్య పావనికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

సీనియర్ కళాకారుడు శ్రీనివాసులు మృతి

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్



కర్నూలు జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు సర్విశెట్టి శ్రీనివాసులు (79) శనివారం ఉదయం 6 గంటలకు నగరంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలోని తన నివాసంలో అనారోగ్యంతో కన్నుమూశారు. సర్విశెట్టి శ్రీనివాసులు కర్నూలు జిల్లా పరిషత్ సిఇఒగా పనిచేశారు. ఆయన కర్నూలు జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం ఏర్పాటు చేసి ఎందరో నూతన కళాకారులను తీర్చిదిద్దారు. ఆయన భౌతికకాయాన్ని కర్నూలు జిల్లా రంగస్థల సీనియర్ కళాకారులు సిహెచ్ చంద్రన్న, కర్నూలు జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పెరికలపాటి హనుమంతరావు చౌదరి, కర్నూలు కళాకారుల సేవా సంఘం అధ్యక్షులు బైలుప్పల షఫీవుల్లా, కర్నూలు రంగస్థలం కళాకారుల సంక్షేమ సంఘం సీనియర్ సభ్యులు సయ్యద్ రోషనలి, సిబి అజయ్ కుమార్, కర్నూలు కళాకారులు వివి.రమణాచారి, నాగరాజు, రామకేశవులు ప్రహ్లాద షేక్షావలి, ఆంజనేయులు, పార్వతయ్య, పుల్లయ్యలు ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ముగిసిన హెచ్‌ఆర్‌సి కమిషన్ చైర్మన్ పదవి కాలం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ మాంధాత సీతారామ్మూర్తి , నాన్ జ్యూడిషియల్ సభ్యులు డాక్టర్ గోచిపాత శ్రీనివాసరావు పదవి కాలం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సజన హెచ్‌ఆర్‌సి కమిషన్ చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగం ఎంతో సహకరించిందని జిల్లా కలెక్టరుకు కృతజ్ఞతలు చైర్మన్ సీతారామమూర్తి తెలిపారు.

ప్రస్తుతం కమిషన్ చైర్మన్ సభ్యుల పదవీకాలం ముగియడంతో కేసుల విచారణను తాత్కాలికంగా నిలిపివేసినట్లు సెక్రెటరీ వెల్లడించారు. నూతన కమిషన్ చైర్మన్ నియామకం పూర్తి అయిన తర్వాత యధావిధిగా కేసుల విచారణ నిర్వహిస్తామని వెల్లడించారు. ఫిర్యాదులను మాత్రం యధావిధిగా స్వీకరిస్తామని తెలిపారు.

ప్రశాంత ఎన్నికలకు చర్యలు : డిఐజి

4 జిల్లాల ఎస్‌పిలు, డిఎస్‌పిలతో కర్నూలు రేంజ్ డిఐజి
క్రికెట్ బెట్టింగ్ పై క్రైమ్ పోలీసులు నిఘా ఉంచాలి
లైసెన్సు గన్‌లను డిపాజిట్ చేయించాలి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు లోబడి ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు పని చేయాలని కర్నూలు రేంజ్ డిఐజి సిహెచ్. విజయరావు కర్నూలు రేంజ్ పోలీసు అధికారులకు , సిబ్బందికి సూచించారు. శనివారం కర్నూలు రేంజ్ డిఐజి కార్యాలయం నుండి కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల ఎస్‌పిలతో డిఐజి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కర్నూలు రేంజ్ పోలీసులు బాధ్యతగా పని చేయాలన్నారు. ఏదైనా సంఘటనలు జరిగినప్పుడు వాస్తవాలను మీడియాకు వెల్లడించాలన్నారు. ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాల పై నిఘా ఉంచాలన్నారు. అవసరమైతే పికెట్ లు, ముందస్తు జాగ్రత్తల చర్యలు చేపట్టాలన్నారు. డిఎస్పీలు, సిఐలు ,ఎస్సైలు నేర నివారణకు గట్టి చర్యలు తీసుకోవాలని చెప్పారు. నేర ప్రవృత్తి గల వారిని బైండోవర్ చేసి పోలీంగ్ డే రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకూడదన్నారు. స్ట్రాంగ్ రూమ్ ల దగ్గర సిసి కెమెరాలతో పకడ్బందీ నిఘా ఉంచాలన్నారు. పోల్ డే రోజు సెంట్రల్ పోలీసు బలగాలతో, రూట్ మొబైల్స్ , స్ట్రైకింగ్ ఫోర్స్ పోలీసులతో పెట్రోలింగ్, రాత్రి గస్తీ విధులు పకడ్బందీగా ఉండాలన్నారు. ఎన్నికల ఉల్లంఘనల పై వెంటనే స్పందించి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలలో పోలీసు బలగాలతో బాగా రూట్ మార్చ్, ఫ్లాగ్ మార్చ్ చేయించాలన్నారు. గన్ లైసెన్సులను అన్నింటిని డిపాజిట్ చేయించాలని సూచించారు. ఇంటిగ్రేటేడ్ , బార్డర్ చెక్ పోస్టులలో పోలీసులు, సెబ్, ఫారెస్ట్, ఆర్టీఏ అధికారులు సమన్వయంతో పని చేసే విధంగా చూసి సంబంధిత అధికారులతో మాట్లాడా లన్నారు. చెక్ పోస్టులలో ఏదైనా పట్టుబడితే సంబంధిత ఇన్‌కం ట్యాక్స్ అధికారులకు లేదా ఇతర అధికారులకు సమాచారం అందించాలన్నారు. సి-విజిల్ యాప్ లో ఎవరైనా ఫిర్యాదులు చేస్తే వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. లా అండ్ఆర్డర్, మోడల్ కోడ్ఆఫ్‌కండక్ట్‌కు లోబడి పని చేయాలన్నారు. స్పెషల్ బ్రాంచ్ పోలీసులు లా అండ్ ఆర్డర్‌పై నిఘా ఉంచి ఎప్పుడికప్పుడు సమాచారాన్ని పైఅధి ,కారులకు చేరవేయాలన్నారు. ఎలాంటి సమస్యలు లేకుండా ప్రశాంతా వాతావరణంలో ఎన్నికలు జరిగేవిధంగా చూడాలన్నారు. వీడియో కాన్ఫరెన్సులో కర్నూలు జిల్లా ఎస్‌పి జి.కృష్ణకాంత్, నంద్యాల జిల్లా ఎస్‌పి కె. రఘువీర్ రెడ్డి ,కడప జిల్లా ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ , అన్నమయ్య జిల్లా ఎస్‌పి బి. కృష్ణరావు, అడిషనల్ ఎస్‌పిలు, డిఎస్‌పిలు, సిఐలు పాల్గొన్నారు.



సెలవుల్లోనూ విద్యుత్ బిల్లు చెల్లించవచ్చు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఈనెల 24, 25 సెలవు దినాల్లో కూడా విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు పని చేస్తాయని వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎపి ఎస్‌పిడిసిఎల్ ఉమ్మడి జిల్లాల పర్యవేక్షక ఇంజనీరు ఎం. ఉమాపతి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కర్నూలు , నంద్యాల జిల్లా కరెంట్ బిల్లుల వసూలు కేంద్రాలు పనిచేస్తాయని, ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకొని తమ విద్యుత్ బిల్లులు చెల్లించాలన్నారు.



మెడికవర్‌లో 20వేల గుండె శస్త్రచికిత్సలు పూర్తి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

మెడికవర్ హాస్పిటల్స్ కర్నూల్ నందు 20,000 కు పైగా గుండె ప్రక్రియలు , గుండె శస్త్రచికిత్సలు పూర్తి చేయడం గర్వకారణమని క్లస్టర్ హెడ్ వై. మహేశ్వర్ రెడ్డి తెలిపారు. కర్నూలు మెడికవర్ హాస్పిటల్స్ లో అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉండటం చాలా గర్వకారణమని మెడికవర్ కార్డియాలజీ , గుండె శస్త్రవైద్య నిపుణులను కొనియాడారు. గుండె సమస్యలను ఖచ్చితత్వంతో గుర్తించడం, వ్యాధి ఏ స్థాయిలో ఉందో తెలిపే గుండె పరీక్షలు, గుండె శస్త్రచికిత్సలను మెడికవర్ హాస్పిటల్స్ లో 20,000 దాటిన సందర్భాన్ని పురస్కరించుకొని హాస్పిటల్ కార్డియాలజీ డాక్టర్ చైతన్య కుమార్, డాక్టర్ తేజానందన్, డాక్టర్ బిఎస్. ప్రవీణ్ , గుండె శస్త్ర చికిత్స వైద్యులు డాక్టర్ నిశిత అశోక్ ఉదపి, మహేశ్వర్ రెడ్డి వైద్య సేవల గురించి మాట్లాడుతూ గుండె జబ్బుతో బాధపడే ఎంతో మంది మెడికవర్ లో చికిత్స తీసుకుని తిరిగి పూర్తి ఆరోగ్య వంతులుగా మారడం గొప్ప విషయమని తెలిపారు. భవిష్యత్తులో మెడికవర్ హాస్పిటల్ అత్యాధునిక వైద్య సేవలు అందించే దిశగా రూపాంతరం చెండుతుందని తెలిపారు.

నా ఊరు.. నా ఇష్టం...

- వైసిపికి ప్రచారం చేస్తా - ఏం రాసుకుంటావో.. రాసుకో...

- న్యూస్ కవరేజీకి వెళ్లిన జర్నలిస్టును బెదిరించిన వాలంటీరు

ప్రజాశక్తి - హోళగుంద


ప్రచారంలో పాల్గొన్న వాలంటీరు

'నా ఊరు.. నా ఇష్టం... వైసిపి కోసం ప్రచారం చేస్తా. ఏం రాసుకుంటావో.. రాసుకో... ఏం ఫొటోలు తీసుకుంటావో.. తీసుకో' అంటూ ఓ వాలంటీరు న్యూస్ కవరేజీ కోసం వెళ్లిన జర్నలిస్టును బెదిరించారు. అధికార పార్టీపై అభిమానమో లేక ఎమ్మెల్యే అభ్యర్థి ముందు తన దర్పం చూపించుకోవాలనుకున్నాడో ఏమో ఓ వాలంటీరు న్యూస్ కవరేజీ కోసం వెళ్లిన ఆంధ్రజ్యోతి ప్రతినిధిపై బూతులు మాట్లాడుతూ, 'నీ అంతు చూస్తా' అంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ సంఘటన హోళగుంద మండలం ముద్దటమాగి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. వైసిపి ఆలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బి.విరుపాక్షి హోళగుంద మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అందులో భాగంగా సులువాయి, మూగమానగుంది, ముద్దటమాగి గ్రామాల్లో పర్యటించారు. గ్రామంలో ప్రచారం నిర్వహిస్తుండగా వాలంటీరు లక్ష్మణ్ సైతం బాణసంచా కాల్చడంతో పాటు ప్రచారంలో పాల్గొన్నారు. ఈ విషయంపై ఫొటోలు తీస్తుండగా ఒక్కసారిగా గట్టిగా కేకలు వేస్తూ 'ఏం రాసుకుంటావో.. రాసుకో.., ఏం ఫొటోలు తీసుకుంటావో.. తీసుకో.., నీ అంత చూస్తా' అంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. 'ప్రచారం కోసం మా ఊరు వచ్చిన ఎమ్మెల్యే అభ్యర్థి వెంట తిరగడం తప్పా. వైసిపి కోసం ప్రచారం చేస్తా. ఎవరికి చెప్పుకుంటావో.. చెప్పుకో' అంటూ కోపోద్రిక్తుడయ్యారు. ఈ విషయంపై ఎంపిడిఒ ఆజాద్‌ను వివరణ కోరగా... వాలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనరాదని, ఒకవేళ పాల్గొంటే చర్యలు తప్పవని తెలిపారు. సదరు వాలంటీరుపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటే ఆయుధం

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళీ

ప్రజాశక్తి - మంత్రాలయం


మంత్రాలయంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి పౌరుడికీ ఓటే ఆయుధంగా భావించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.మురళీ తెలిపారు. కలెక్టర్ డాక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశాల మేరకు శనివారం స్థానిక శ్రీరాఘవేంద్ర డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు, బూత్ స్థాయి అధికారులు, సెక్టోరల్ అధికారులకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఎస్‌విఇఇపి (సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్, ఎలక్ట్రోస్ పార్టిషిపేషన్) ఆధ్వర్యంలో ఎన్నికల కార్యకలాపాలలపై, ఇవిఎం పనితీరును వివరించి ర్యాలీ నిర్వహించారు. మంత్రాలయం తహశీల్దార్ శ్రీధర్ మూర్తి, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ గురురాజారావు, డిప్యూటీ తహశీల్దార్ రాఘవేంద్ర, శశి శేఖర్ రావు, కళాశాల ప్రిన్సిపల్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

గోనెగండ్ల : ప్రజలు తమ భవిష్యత్తును నిర్దేశించుకునే ప్రజాస్వామ్య ఆయుధమే ఓటు హక్కు అని తహశీల్దార్ బి.పార్వతి, ఎంపిడిఒ సోనీ బాయి తెలిపారు. గోనెగండ్లలో ఓటుహక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ తహశీల్దార్ కార్యాలయం, బస్టాండు, వైఎస్ఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఓటుహక్కు ప్రజలకు ప్రజాస్వామ్యం ప్రసాదించిన ఆయుధమని తెలిపారు. ప్రతి ఒక్కరూ విధిగా ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా భవిష్యత్తును నిర్దేశించుకోవాలని చెప్పారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకొని ఓటు హక్కును పొందడంతో పాటు ఓటుహక్కు కలిగిన వారందరూ పోలింగ్ రోజున ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎంఇఒ-2 నీలకంఠ, హరిజనవాడ ప్రధానోపాధ్యాయులు విజయభాస్కర్, కెజిబివి ఎస్ఒ విద్యావతి, సిఆర్‌పిలు రవిబాబు, గోవిందరాజులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి

- తహశీల్దార్ ఈరమ్మ

ప్రజాశక్తి - ఆస్పరి



18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని తహశీల్దార్ ఈరమ్మ తెలిపారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏప్రిల్ 15 వరకు ఫారం-6 ద్వారా ఓటు నమోదుకు అవకాశం ఉందని తెలిపారు. మండలంలో 26,225 మంది పురుషులు, 25,566 మంది మహిళలు, ట్రాన్స్ జెండర్స్ 4 ఓటర్లు ఉన్నారని చెప్పారు. మండలంలో 65 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి గ్రామంలోనూ ఎన్నికల కమిషన్ ఆదేశించిన సూచనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఎవరైనా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు తెలిస్తే వారిని విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు.

ఘనంగా భగత్ సింగ్ వర్ధంతి

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని సుందరయ్య భవనంలో శనివారం కార్మిక, రైతు, విద్యార్థి, యువజన, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్ధంతి సభ నిర్వహించారు. సిఐటియు పట్టణ కార్యదర్శి పిఎస్.గోపాల్, ఎఐటియుసి పట్టణ నాయకులు ఒబి.నాగరాజు, ఐఎఫ్‌టియు నాయకులు ఎంకప్ప అధ్యక్షత వహించారు. ముందుగా భగత్‌సింగ్ చిత్రపటానికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు అజయ్ బాబు, రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు మల్లికార్జున, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ నాయకులు జాతీయ ఉద్యమంలో ఏనాడూ పాల్గొనలేదని తెలిపారు. అలాంటి వారు నేడు తామే అసలైన దేశభక్తులమంటూ చెప్పడం హాస్యాస్పదమని విమర్శించారు. దేశభక్తి ముసుగులో ప్రజల్లో భ్రమలు కల్పిస్తూ నిరంతరం జాతీయ వాదం పేరుతో యువతను, విద్యార్థులను పక్కదోవ పట్టిస్తున్నారని తెలిపారు. దేశంలో మత విద్వేషాలను సృష్టిస్తూ, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేట్ పరం చేస్తూ, యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా పాలన సాగిస్తున్నారని విమర్శించారు. కార్మిక, రైతు, యువతను దగా చేస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని, దానికి మద్దతు ఇస్తున్న టిడిపి, జనసేన, వైసిపిని ఓడించి వామపక్ష పార్టీలు బలపరుస్తున్న అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సిఐటియు సీనియర్ నాయకులు పి.ఈరన్న, బి.మహానంద రెడ్డి, పట్టణ అధ్యక్షులు బి.తిప్పన్న, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న సిపిఐ పట్టణ, మండల కార్యదర్శులు సుదర్శన్, కల్లుబావి రాజు, ప్రగతి మహిళా సంఘం జిల్లా నాయకులు మణెమ్మ, ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, పిడిఎస్‌యు జిల్లా నాయకులు అఖండ, ఎఐఎస్ఎఫ్ నాయకులు షాబీర్ బాష, రైతుసంఘం మండల అధ్యక్షులు నరసప్ప, ఎఐటియుసి పట్టణ నాయకులు షేక్షావలీ, హుస్సేని, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు తిక్కప్ప, నాయకులు పరమేష్, ఆటో యూనియన్ నాయకులు శంకర్, హనీఫ్, సిడబ్ల్యుసి హమాలీ యూనియన్ నాయకులు బి.మారెప్ప, ఉరుకుందు, రాముడు, దిగారి గ్రేటర్ హమాలీ యూనియన్ నాయకులు బి.రంగ, బి.బొజ్జప్ప, బి.వీరాంజనేయులు, కుమార్ పాల్గొన్నారు. అలాగే ఆదోని పట్టణ, గ్రామాల్లో భగత్ సింగ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి యుటిఎఫ్ కార్యాలయంలో పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, నాయకులు గౌస్, దినేష్, రాజు, శ్రీనివాస్, గణేష్, నాగరాజు, సూర్య, రంజాన్ పాల్గొన్నారు. **దేవనకొండ**లోని సిపిఐ కార్యాలయంలో ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల చిత్ర పటాలకు పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయం నుంచి భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల చిత్రపటాలతో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీసు స్టేషన్ సర్కిల్‌లో బహిరంగ సభను ఎఐటియుసి జిల్లా నాయకులు ఎం.నరసరావు అధ్యక్షతన నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.మద్దిలేటి శెట్టి, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.తిమ్మయ్య, వ్యకాస జిల్లా అధ్యక్షులు వీరశేఖర్ మాట్లాడారు. సిపిఐ, సిపిఎం పట్టణ కార్యదర్శులు వి.రాజశేఖర్, యూసుఫ్ బాష, రైతు సంఘం మండల గౌరవాధ్యక్షులు వై.కండప్ప, రైతు సంఘం మండల కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, వ్యకాస మండల అధ్యక్షులు కృష్ణ, ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి రవి, అధ్యక్షులు రామాంజి, ఎఐఎస్ఎఫ్ మండల అధ్యక్షులు మధుబాబు, సురేంద్ర, భాస్కర్, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి శ్రీనివాసులు, ఎఐటియుసి మండల నాయకులు వీరస్వామి, బడే సాహెబ్, నాయకులు అశోక్, బండ్లయ్య, సుల్తాన్, మహ్మద్, కోదండ, నాగరాజు, బలరాం, రాజు, నాగేంద్ర, రామాంజి, రాజశేఖర్ పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలోని సుందరయ్య కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, కార్మిక, రైతు సంఘం ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతి నిర్వహించారు. డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సురేష్, సిఐటియు పట్టణ కార్యదర్శి రాముడు, ఎపి రైతుసంఘం పట్టణ కార్యదర్శి లక్ష్మీ నరసయ్య, ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి విజయ్, ఆటోవర్కర్స్ యూనియన్ నాయకులు రాజు, కెవిపిఎస్ నాయకులు రాజు, చేనేత సంఘం నాయకులు కృష్ణ మాట్లాడారు. కెవిపిఎస్ నాయకులు రాజు, ఆమోసు, రామాంజి, నరసన్న, శివ, కైఫ్, నవాజ్ పాల్గొన్నారు. **ఆస్పరి**లోని సిపిఐ కార్యాలయంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నివాళు లర్పించారు. ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి రమేష్, ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ మండల నాయకులు భాస్కర్, నజీర్, రాజు, నవీన్, శివ, వెంకటేష్ పాల్గొన్నారు. **కౌతాళం**లో సిపిఎం కార్యాలయంలో భగత్ సింగ్ వర్ధంతి నిర్వహించారు. సిపిఎం సీనియర్ నాయకులు కె.మల్లయ్య పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సిపిఎం మండల కన్వీనర్ మేలిగిరి ఈరన్న, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు వీరేష్, పులిగయ్య, రామలింగ, సత్యప్ప, శంకర్, కెవిపిఎస్ నాయకులు బసవ, ఆదాం, తిక్కయ్య పాల్గొన్నారు. **హాలహర్వి**లో పచ్చర్‌పల్లి భగత్ సింగ్ యూత్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతి నిర్వహించారు. సిపిఎం మండల నాయకులు కృష్ణ, భగత్ సింగ్ యూత్ జనార్ధన్, నాయకులు ధనుంజయ్ పాల్గొన్నారు. **గోనెగండ్ల** మండలంలోని పెద్దమరివీడు ఎంపియుపి పాఠశాలలో భగత్ సింగ్ వర్ధంతి నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు రామలింగం, సీనియర్ ఉపాధ్యాయులు నాగేశ్వరరావులు భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


ఎమ్మిగనూరులో


ఆదోనిలో మాట్లాడుతున్న రామాంజనేయులు


దేవనకొండలో

అన్నదానానికి రూ.10 లక్షల విరాళం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠం నిర్వహణలో జరుగుతున్న నిత్యాన్నదానానికి భక్తుల నుంచి రూ.10 లక్షల విరాళం వచ్చినట్లు శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం రాఘవేంద్ర స్వామి దర్శనార్థమై కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన జలజాక్ష కుటుంబ సభ్యులు వచ్చారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. అనంతరం శ్రీమఠం పరిపాలన కార్యాలయంలో మేనేజర్ శ్రీనివాసరావును కలిసి విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె పేరుపై రూ.10 లక్షల రసీదు వేయించి ఇచ్చినట్లు పేర్కొన్నారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు ఆదేశాల మేరకు విరాళం ఇచ్చిన దాత కుటుంబ సభ్యులకు మెమొంటో అందజేశారు.


విరాళం అందజేస్తున్న దాతలు

ఆదోని టికెట్ జనసేనకే కేటాయించాలి

- ఆందోళనకు దిగిన జనసేన నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని అసెంబ్లీ నియోజకవర్గ టికెట్ జనసేన పార్టీకి కేటాయించాలని ఆ పార్టీ నాయకులు రేణు వర్మ, పులి రాజు డిమాండ్ చేశారు. శనివారం టికెట్ కేటాయించాలని పట్టణంలోని డీఎస్పీ కార్యాలయం రోడ్డులో జనసేన కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జనసేన ఆవిర్భావం నుంచి నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటూ పార్టీ బలోపేతం కోసం మల్లప్ప ఎనలేని కృషి చేశారన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన మల్లప్పకు ప్రజల్లో సదాభిప్రాయం ఉందన్నారు. అధికార పార్టీ నాయకులు అవలంభిస్తున్న దౌర్జన్యాలను కూడా లెక్కచేయకుండా నియోజకవర్గంలో వారి తప్పులను ఎత్తిచూపుతో ప్రజలకు అండగా ఆందోళనలు నిర్వహించారని తెలిపారు. అధిష్టానం పిలుపు ఇచ్చిన కార్యక్రమాలను నియోజకవర్గంలో దిగ్విజయం చేశామన్నారు. 2019 ఎన్నికల్లో త్రిముఖ పోటీలో సుమారు 12 వేల ఓట్లు మల్లప్ప సాధించారని తెలిపారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థిగా మల్లప్పకు అవకాశం కల్పిస్తే కచ్చితంగా విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఆదోని ప్రజలు కొత్త వ్యక్తిని కోరుకుంటున్నారని, అవకాశాన్ని తాము సద్వినియోగం చేసుకుంటామని తెలిపారు. జనసేనకు టికెట్ కేటాయించేలా పవన్ కల్యాణ్ చొరవ చూపాలని కోరారు. నాయకులు చిరుత రాజశేఖర్, చంద్రశేఖర్, రాజేశ్వరి, శ్యామ్, వెంకటేష్, భీమన్న, అయ్యప్ప, తిరుమల, బసవ, నరసన్న, జయరాజు, వెంకటేష్ పాల్గొన్నారు.


డీఎస్పీ కార్యాలయం రోడ్డులో నిరసన చేపడుతున్న నాయకులు

తిక్కారెడ్డికి టికెట్‌పై

అధిష్టానం పునరాలోచించాలి

- నియోజకవర్గంలోని టిడిపి నాయకుల విజ్ఞప్తి

ప్రజాశక్తి - మంత్రాలయం

టిడిపి నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ విషయంలో అధిష్టానం పునరాలోచించి పాలకుర్తి తిక్కారెడ్డికే ఇవ్వాలని నియోజకవర్గంలోని టిడిపి నాయకులు కోరారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేశప్ప స్వామి అధ్యక్షతన పెద్దకడబూరు మండలం గవిగట్టు, కలుకుంట, మంత్రాలయం మండలం మాలపల్లి, సౌలహళ్లి, సుంకేశ్వరి, పరమాన్‌దొడ్డి గ్రామాల నాయకులు, కార్యకర్తలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. టిడిపి టికెట్‌ను తిక్కారెడ్డికే ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు సుధీర్ రెడ్డి, తెలుగు రైతు జిల్లా కార్యదర్శులు బూదూరు మల్లికార్జున రెడ్డి, మాలపల్లి సత్యనారాయణ రెడ్డి, ఎల్లారెడ్డి, చావిడి వెంకటేష్, యువ నాయకులు మాధవరం కృష్ణమోహన్ రెడ్డి, అశోక్ రెడ్డి, తెలుగు యువత మీడియా కోఆర్డినేటర్ విజయ రామిరెడ్డి, జెట్టి వీరేష్, దేవదాస్, దాసప్పరెడ్డి, శంకర్ నాయక్, శివరాం, ఏబు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

సంక్షేమం, అభివృద్ధి వైసిపికి రెండు కళ్లు

- వైసిపి ఎమ్మిగనూరు అభ్యర్థి బుట్టా రేణుక

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సంక్షేమం, అభివృద్ధి వైసిపికి రెండు కళ్లు అని వైసిపి అభ్యర్థి, మాజీ ఎంపీ బుట్టా రేణుక తెలిపారు. శనివారం పట్టణంలోని 21వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ వైసిపిని మరోసారి ఆదరించాలని కోరారు. ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ఆప్యాయంగా పలుకరిస్తూ వైసిపి ప్రభుత్వం చేపట్టిన పథకాలను వివరించారు. వైసిపికి ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బివై.రామయ్యను గెలిపించాలని కోరారు. ప్రచారంలో వార్డు ఇన్‌ఛార్జీ తార రాజశేఖర్, టౌన్ బ్యాంకు డైరెక్టర్ చాంద్ బాషా, బుట్టా నీలకంఠ, బుట్టా ప్రతుల్, శాప్ నెట్ స్టేట్ ఛైర్మన్ మాచాని వెంకటేష్, మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ రఘు, పట్టణ అధ్యక్షులు బుట్టా రంగయ్య, వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షులు రియాజ్, టౌన్ బ్యాంకు ఛైర్మన్ కొమ్ము రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి వీరేంద్ర, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు అబ్రార్, కౌన్సిలర్లు కామర్తి నాగేశప్ప, శివ ప్రసాద్, నీలకంఠ, అమాన్, వాహీద్, సుధాకర్, ఇన్‌ఛార్జీలు కోటకొండ నరసింహులు, విశ్వనాథ్, రమేష్, విశ్వనాథ్, ప్రతాప్ రెడ్డి, చంద్రశేఖర్, వడ్డే వీరేష్, రామాంజి రెడ్డి, గట్టు ఖాజా, నాయకులు గోకారి, మాచాని రఘు, రామలింగారెడ్డి, వడ్డే నాగరాజు, సురేష్ చౌదరి, రజాక్, జిఎం.బాషా, కన్వీనర్ మధు, బుట్టా యూత్ నాయకులు ఉబెద్, ఫయాజ్ పాల్గొన్నారు

బాధిత కుటుంబానికి బుట్టా రేణుక పరామర్శ

పట్టణంలోని శివన్న నగర్ కాలనీ చెందిన మంగళి ప్రకాష్ బైక్ యాక్సిడెంట్ జరిగి అక్కడికక్కడే మృతి చెందారు. బుట్టా రేణుక విషయం తెలుసుకొని ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రిలో వారి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామన్నారు. బుట్టా శివ నీలకంఠ, బుట్టా ప్రతుల్, 5వ వార్డు కౌన్సిలర్ అమాన్ పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న బుట్టా రేణుక

రిజర్వాయర్లకు నిధులివ్వలేని ప్రభుత్వాన్ని సాగానంపుదాం

- జనసేన ఇన్‌ఛార్జీ వెంకప్ప

ప్రజాశక్తి - ఆలూరు



నియోజకవర్గం లోని రిజర్వాయర్లకు నిధులు కేటాయించ లేని వైసిపి ప్రభుత్వాన్ని సాగానంపుదామని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జీ తెర్నేకల్ వెంకప్ప కోరారు. శనివారం ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలు అంటూ రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి నిత్యావసర ధరలు, విద్యుత్, బస్సు చార్జీలు, పెట్రోల్, డీజిల్‌పై అధిక ధరలు పెంచారని తెలిపారు. ప్రజల రక్తాన్ని పీలుస్తూ అభివృద్ధిని గాలికొదిలేసిన వైసిపి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయన్నారు. నిధుల్లేక ఆగిపోయిన వేదవతి, నగరడోన రిజర్వాయర్లు పూర్తి కావాలంటే వైసిపి ప్రభుత్వాన్ని ఓడించి, ఎన్‌డిఎ కూటమిని గెలిపించాలని కోరారు.

ఆది, సోమవారాల్లోనూ పన్ను చెల్లించవచ్చు

- కమిషనర్ రామచంద్ర రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని



పెండింగ్ ఇంటి పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఆది, సోమవారాల్లోనూ పన్ను చెల్లించవచ్చని ఆదోని మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. ఈనెల 24, 25న సెలవు రోజుల్లో కూడా మున్సిపల్ కార్యాలయంలో ఆస్తి, ఖాళీ స్థలం, నీటి పన్నులు తీసుకుంటారని తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి ఇంటి, నీటి పన్నులు సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

'గంజహళ్లి'ని ఎస్సీ రిజర్వ్ చేయాలి

- జై భీమ్ మాల మహానాడు రాష్ట్ర నాయకులు రంగయ్య

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

గంజహళ్లి పంచాయతీ సర్పంచి స్థానాన్ని ఎస్సీ రిజర్వ్ చేయాలని జైభీమ్ మాలమహానాడు రాష్ట్ర నాయకులు సి.రంగయ్య డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు మల్లేష్, యువదళం జిల్లా అధ్యక్షులు నల్లన్న ఆధ్వర్యంలో ఐకొండ గ్రామస్తులు సి.రంగయ్యను మర్యాద పూర్వకంగా కలిశారు. ఎన్నికల నేపథ్యంలో రంగయ్య వెంటే తమ కుటుంబాలు ఉంటాయని తెలిపారు. జాతి బాగోగులు, జాతి పట్ల గౌరవం, నియమ, నిబద్ధత కలిగిన నాయకులు రంగయ్య అని చెప్పారు. ఈసారి ఎన్నికల్లో రంగయ్య వెంట నడుస్తామని తెలిపారు. అనంతరం రంగయ్య మాట్లాడారు. ఎల్లవేళలా దళిత జాతికి అండగా మన సైన్యం ఉంటుందని, రాబోయే రోజుల్లో మరింత బలంగా తయారు చేస్తానని తెలిపారు. ఐకొండలో దాదాపు 120 కుటుంబాలు, గంజహళ్లిలో 70 కుటుంబాలు మాలలకు చెందినవని చెప్పారు. ఇప్పటి వరకు మాల, మాదిగలే మెజారిటీ ఉండి ఎస్సీ రిజర్వ్ చేయకపోవడం దారుణమని తెలిపారు. పంచాయతీ ఎన్నికల నాటికి సర్పంచి, ఎంపిటిసి స్థానాల్లో అవసరమైతే స్వతంత్రంగా పోటీకి సిద్ధమని చెప్పారు. అనంతరం రంగయ్యను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. సీనియర్ నాయకులు చిన్న రంగన్న, ఐకొండ గ్రామ మాలలు జయరాం, రాజు, రవి, కృష్ణ, పరమేష్, ఉరుకుందు, ముని, సూరి, సింహాద్రి, శేఖర్, వెంకటేష్ పాల్గొన్నారు.


రంగయ్యను కలిసిన ఐకొండ మాలలు

ముగిసిన 'బార్' నామినేషన్ల ప్రక్రియ


నామినేషన్ల పత్రాలను సమర్పిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని బార్ అసోసియేషన్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ శనివారంతో ముగిసింది. రెండో రోజు జనరల్ సెక్రటరీ పదవి కోసం లోకేష్ కుమార్ నామినేషన్ దాఖలు చేశారు. వైస్ ప్రెసిడెంట్ పదవికి తాయన్న, కోశాధికారిగా అబ్దుల్ అన్సారి, స్పోర్ట్స్ సెక్రటరీగా ఖలందర్ నామినేషన్లు వేశారు. రెండు రోజులపాటు జరిగిన నామినేషన్ల ప్రక్రియలో ఇప్పటి వరకు 10 నామినేషన్లు దాఖలయ్యాయని ఎన్నికల అధికారులు, సీనియర్ న్యాయవాదులు శ్రీరాములు, రామలింగ చెప్పారు. ప్రెసిడెంట్, జనరల్ సెక్రటరీ మధ్య ప్రధానంగా పోటీ ఉండే అవకాశం ఉంటుందని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

జర్నలిస్టుల సమస్యలను మేనిఫెస్టోలో చేర్చండి

- బుట్టా రేణుకకు ఎపియుడబ్ల్యుజె వినతి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

జర్నలిస్టుల సమస్యలను రాజకీయ పార్టీలు మేనిఫెస్టోలో చేర్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఎపియుడబ్ల్యుజె తాలూకా అధ్యక్షులు బి.శ్రీనివాస నాయుడు, ప్రధాన కార్యదర్శి చిన్నాకుల నాగరాజు కోరారు. శనివారం భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా జాతీయ జర్నలిస్టుల కోరికల దినోత్సవం నిర్వహించారు. వైసిపి ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుకను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస నాయుడు, చిన్నాకుల నాగరాజు, జిబి.పరమేష్ మాట్లాడారు. మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేసి జర్నలిస్టుల మీడియా భద్రకు జాతీయ స్థాయిలో ప్రత్యేక చట్టం చేయాలని కోరారు. వర్కింగ్ జర్నలిస్టుల చట్టాన్ని పునరుద్ధరించి దాడులను అరికట్టాలని, 3 సెంట్ల ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందుకు బుట్టా రేణుక సానుకూలంగా స్పందించారు. వినతి పత్రాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. వైసిపి నాయకులు బుట్టా శివ నీలకంఠ, బుట్టా ప్రతుల్, ఎపియుడబ్ల్యుజె నాయకులు నూర్ అహ్మద్, వి.రామకృష్ణ, ఎం.ఈరన్న, బాబురాజు, శివ, అశోక్, ఆవుల శ్రీనివాసులు, సి.నాగరాజు, తిరుమల, వెంకటేష్, బాలాజీ కుమార్, బెస్త రవి, ఎల్లయ్య ఆచారి, వీరయ్య, గాజుల వెంకటేష్, అబ్దుల్లా, సి.ఈరన్న, ఎం.రాజు, డ్యాన్స్ రవి, బనవాసి ఈరన్న, రాజు, నాగభూషణం, హరి, సునీల్ కుమార్, రహిమాన్, రంగన్న పాల్గొన్నారు. **మంత్రాలయం**లో ఐజెయు పిలుపు మేరకు జర్నలిస్టుల కోరికల దినం నిర్వహించారు. ఎపియుడబ్ల్యుజె ఆధ్వర్యంలో రాఘవేంద్ర సర్కిల్ నుంచి బస్టాండ్ సమీపంలో ఉన్న డాక్టర్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎపియుడబ్ల్యుజె జిల్లా ఉపాధ్యక్షులు చాంద్ బాషా, తాలూకా కార్యదర్శి హుస్సేని, కోశాధికారి సాబువలీ, ఆర్గనైజింగ్ కార్యదర్శి సూర్యనారాయణ, మండల అధ్యక్షులు భీమరాయ, కార్యదర్శి వడ్డే వెంకట్, జర్నలిస్టులు రానోజీ రావు, రాఘవేంద్ర గౌడ్, నరసప్ప, రఫీ, తిమ్మారెడ్డి, యనుమల ఈరన్న, వీరేష్, కంతం నరసింహ, గాబ్రియల్, దివాకర్, పరమేష్ గౌడ్, చిదానంద పాల్గొన్నారు.


వైసిపి అభ్యర్థి బుట్టా రేణుకకు వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

ఎన్నికల నియమావళి అమలుకు నాలుగు టీమ్‌లు

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిరంజీవి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



నియోజకవర్గంలో ఎన్నికల నియమావళిని అమలు చేసేందుకు నాలుగు టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిరంజీవి తెలిపారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో చిరంజీవి, తహశీల్దార్లు పి.శేషారెడ్డి, భూపతి పార్వతి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల నియమావళి ప్రకారం పబ్లిక్ ప్రాంతాల్లో రాజకీయ పార్టీల ఫొటోలు, జెండాలు, గుర్తులకు అవకాశం లేదని, వాటిని తొలగించామని తెలిపారు. మూడు మండలాలకు ఎంపిడిఒలు మున్సిపల్ ప్రాంతంలో ఇంటింటికీ మున్సిపల్ కమిషనర్ బాధ్యత వహించాల్సిందేనని చెప్పారు. ఇంటింటి ప్రచారం చేపట్టే రాజకీయ పార్టీల అభ్యర్థులు రోజువారీగా ఎంత మంది ప్రచారానికి వెళ్తున్నారో వారి అనుమతులు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ద్వారా పొందాలన్నారు. 48 గంటలు ముందుగా అనుమతులు పొందాల్సి ఉంటుందన్నారు. నియోజకవర్గంలో 274 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 2.44 లక్షల మంది ఓటర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు కవాతు

ప్రజాశక్తి - మంత్రాలయం

కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎస్పీ కృష్ణమూర్తి, డీఎస్పీ సీతారామయ్య, సిఐ ఎరిషావలీ ఆదేశాల మేరకు మండలంలోని గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు కవాతు నిర్వహించినట్లు మంత్రాలయం, మాధవరం ఎస్ఐలు గోపినాథ్, కృష్ణమూర్తి తెలిపారు. శనివారం సెంట్రల్ ఫోర్స్‌తో మంత్రాలయం, బూదూరు, మాధవరం గ్రామాల్లో కవాతు నిర్వహించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించడం, ఓటర్ల భద్రతకు భరోసా కల్పించేందుకు కవాతు నిర్వహించినట్లు తెలిపారు.


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు